## క్లుప్తంగా

### అలుదులో కేంద్రం బృందం పర్యటన



గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్న బృందం సభ్యులు

సారవకోట: మండలంలోని అలుదును స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ ఉత్తమ పంచాయతీగా కేంద్రం ప్రభుత్వం ఆన్‌లైన్ ఎంపిక చేసింది. దీంతో మంగళవారం కేంద్రం బృందం సభ్యుడు శశికాంత్ గ్రామంలో పర్యటించారు. సంబంధిత యాప్‌లో వివరాలు నమోదు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మరుగుదొడ్ల నిర్వాహణ తదితర అంశాలను పరిశీలించారు. డీపీఆర్సీ శాంతి, ఐఈసీ కన్సల్టెంట్ అమ్మాజి, సర్పంచ్ సాగిపల్లి దండాశి, వైఎస్సార్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పార్టీ నాయకులు రావాడ శ్రీనివాసరావు, కింజరాపు శ్రీను తదితరులున్నారు.

### రూ.2.50 లక్షల పరిహారం అందజేత



మృతుని కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండలంలోని తిడిమి గ్రామానికి చెందిన ఎల్.లక్ష్మీనారాయణ ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఏనుగుల దాడిలో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి తక్షణ సాయం కింద అప్పట్లో రూ.2.50 లక్షలు అందజేశారు. మిగిలిన నష్ట పరిహారం రూ.2.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే రెడ్డి శాంతి తన క్యాంప్ కార్యాలయంలో అటవీశాఖ రేంజ్ అధికారి వి.తవిటినాయుడు సమక్షంలో మంగళవారం అందజేశారు. తిడిమి సర్పంచ్ టి.ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు కె.గీత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.ప్రదీప్ తదితరులు ఉన్నారు.

### గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి



ఎర్రమానుగూడలో గిరిజనులతో మాట్లాడుతున్న ఎండయ్య

మెళియాపుట్టి: మారుమూల గిరిజన గ్రామాలను సైతం అభివృద్ధి చేసే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నాయకుడు గూడ ఎండయ్య అన్నారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధిలోని పాతర్లోవ, నేరడిలోవ, ఎర్రమానుగూడ గిరిజన గ్రామాలను మంగళవారం సందర్శించారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇదివరకే కొత్తూరు పంచాయతీలోని గ్రామాల్లో మురుగునీటి కాలువలు నిర్మాణాలు పూర్తిచేశామన్నారు. మిగతా గ్రామాల్లోని సమస్యలను సైతం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎంపీపీఈశ్వరమ్మ సహకారంతో పరిష్కరిస్తామన్నారు. ఎర్రమానుగూడ ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యాప్రమాణాలు మెరుగ్గా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. పార్టీ నాయకుడు పెద్దింటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

### నేడు, రేపు దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

పొందూరు: ఈ నెల 30, 31 తేదీల్లో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పైడి రామప్రసాద్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ నూతన విధానంతో డీటీపీ ఆపరేటర్లు రోడ్డున పడతారని తెలిపారు.

### గ్రామ వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



పొందూరు: ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

పొందూరు: మండలంలోని ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సీపాన హరిహరరావు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బాణాం, ధర్మపురం, కింతలి, లోలుగు, మొదలవలస, పొందూరు, రాపాక, వీఆర్ గూడెం గ్రామాల్లో వలంటీర్ పోస్టులకు 14 మంది హాజరయ్యారని చెప్పారు. ఈ నెల 31న నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు.

**జలుమూరు మండలంలో..**

జలుమూరు: మండల పరిధిలోని పాగోడు, పెద్దదూగాం, లింగాలవలస, కరవంజ పంచాయతీలలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు తెలిపారు. నాలుగు వలంటీర్ పోస్టులకు ఏడుగురు హాజరయ్యాన్నారు. తహసీల్దార్ బి.సత్యం ఇంటర్వ్యూలు నిర్వహించారు.



బూర్జ: బూర్జ హైస్కూల్‌లో రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలు వేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



హిరమండలం: కేజీబీవీలో గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎస్ఓ వృష్ణవేణి, విద్యార్థులు



పాతపట్నం: గంగువాడ ఉన్నత పాఠశాలలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

## గిడుగు, ధ్యాన్‌చంద్ సేవలు చిరస్మరణీయం

● ఘనంగా తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు



పాతపట్నం: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రెడ్డిశాంతి, నాయకులు



సరుబుజ్జిలి: గిడుగు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న, అధికారులు, నాయకులు, విద్యార్థులు

తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి పురస్కరించుకుని, తెలుగు భాషా దినోత్సవం.. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో జరిగిన ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న వారంతా రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను కొనియాడారు. గ్రాంథికంలో ఉన్న తెలుగులోని వచనాన్ని వాడుక భాషలోకి తీసుకువచ్చి, నిత్యవ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్ని, మాధుర్యాన్ని తెలియజేసిన మహనీయుడు, గొప్ప కవి రామ్మూర్తి అని వక్తలు ప్రశంసించారు. హాకీ క్రీడతో భారత ఖ్యాతిని ప్రపంచ నలుమూలలకు వ్యాపింపజేసిన ధ్యాన్‌చంద్ గౌరవ సూచకంగా ఏటా ఇదేరోజున క్రీడాదినోత్సవం నిర్వహించి, ప్రముఖ క్రీడాకారులు, కోచ్‌లను సత్కరిస్తూ వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



సారవకోట: స్పోర్ట్స్ డే ఆకారంలో విద్యార్థులు



సారవకోట: అవలింగిలోని జేబీటీ పాఠశాలలో తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి వేషధారణలో విద్యార్థులు



ఎల్ఎన్‌పేట: ఎమ్మార్సీలో తెలుగు కవులుగా విద్యార్థుల ప్రదర్శన



నరసన్నపేట: బాడాం ఉన్నత పాఠశాలలో బహుమతులు పొందిన విద్యార్థులు



పోలాకి: ఈదులవలస ఆదర్శ పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య



ఎల్.ఎన్.పేట: కరకవలస జెడ్పీహెచ్ఎస్‌లో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు



జలుమూరు: బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఆమదాలవలస: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రిన్సిపాల్ స్వామి

## సీఎం జగన్‌తో సంక్షేమ పాలన



సరుబుజ్జిలి: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

● స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి
● గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

సరుబుజ్జిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయంలోనే సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం స్పష్టంచేశారు. పెద్ద సవలాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ స్వయంగా వెళ్లి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. గ్రామ వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు పనితీరు, పథకాల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు పడుతున్నారో ఆరా తీశారు. గ్రామంలో పలురకాల సమస్యలు గురించి ప్రజలు స్పీకర్ దృష్టికి తెచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కారమార్గాన్ని సూచించారు. మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ బద్రి రామారావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, మండల సచివాలయం కన్వీనర్ అత్తులూరి రవికాంత్, ఎంపీడీఓ మురళీమోహన్ పాల్గొన్నారు.

**ఇంటింటికీ తాగునీరు..**

ప్రతీ ఇంటికి తాగునీటిని అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్ పనిచేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. పెద్దసవలాపురం గ్రామంలో రూ.66 లక్షల నిధులతో జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించనున్న ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

**అమ్మా.. మీ సమస్యలు చెప్పండి**

మెళియాపుట్టి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఇల్లాయిపురం గ్రామ సచివాలయం పరిధిలోని ఆంపురం, బంజీరు, పెంగువాడ గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గిరిజన మహిళలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కులం, మతం, వర్గం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకై క ముఖ్యమంత్రి జగనన్న అని అన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేశామన్నారు. పలు గ్రామాల్లో ఇప్పటికే రహదారుల నిర్మాణం పూర్తయ్యాయని, మరికొన్ని చోట్ల పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అర్హత ఉన్నవారు సంక్షేమ పథకాల కోసం సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆంపురంలో పలువురు వృద్ధులు మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వంలో మాలాంటి పేదలందరం సంతోషంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, మండల నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్ జమ్మయ్య, జయమునిరావు, శశిభూషణ్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, పార్టీ నాయకుడు జమ్మయ్య, ఎంపీడీఓ చంద్రకుమారి, ఎంఈఓ దేవేంద్రరావు, ఏపీఎం లలిత, సచివాలయ సిబ్బంది, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

## వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

● ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: వ్యవసాయంలో అనేక మార్పులు వస్తున్నాయని, శాస్త్ర సాంకేతికత అందుబాటులోనికి వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యవసాయానికి పెద్దపీట వేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ప్రధానంగా యంత్రాల వినియోగం పెరిగిన నేపథ్యంలో రైతులకు పరికరాలపై రైతులకు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని కిళ్లాం వద్ద జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శిమ్మ నేతాజీ ఆధ్వర్యంలో డ్రోన్‌తో క్రిమిసంహారిక మందుల పిచికారీ విధానంపై మంగళవారం క్షేత్ర ప్రదర్శన చేపట్టారు. దీనిని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. నూతన పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని కోరారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా రైతులకు తగిన సూచనలు, సలహాలు, శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో 25 డ్రోన్లు సిద్ధం చేశామని, రైతులకు ఆధునిక సాంకేతికను అందుబాటులోనికి తీసుకువస్తున్నామన్నారు. ఆర్‌బీకేల్లో డ్రోన్ల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. డ్రోన్ల వినియోగంపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. డ్రోన్ల ద్వారా మందులు పిచికారీ ఎంతో సులువన్నారు. శాస్త్రవేత్త సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతికను జోడించాలని, అప్పుడే ఖర్చు తగ్గుతుందన్నారు. నానో మందులు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. టెక్నాలజీని వ్యావసాయానికి అనుసంధానం చేసుకోవాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలా సూచనలు, సలహాలు ఇస్తున్నామన్నారు. యంత్ర పరికరాలు అద్దెకు ఇస్తున్నామని, కస్టమ్, ఇయరింగ్ సెంటర్లు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు ఉదయ్‌బాబు, మధుకుమార్, అమరావతి, వ్యవసాయాధికారులు త్రినాథస్వామి, సీహెచ్ వెంకటరావు, రవీంద్రభారతి, కె.సునీత, చిరంజీవులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

పాతపట్నం: విద్యార్థులు సోదరభావంతో మెలగాలని లీగల్ సెల్ అడ్వకేట్ ఎం.రమణ అన్నారు. మండలంలోని సీది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. విద్యా హక్కులు చట్టాలను వివరించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. ఎంఈఓ బి.శ్రీధర్, హెచ్ఎం బి.రమణమూర్తి, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు

● స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొల్లివలసలో రూ.68 లక్షలు, సుంకరాడలో రూ.24 లక్షలు, నీలాదేవిపురంలో రూ.74 లక్షల నిధులతో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిల కార్యక్రమానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. బూర్జలో రూ.36.34 లక్షల నిధులతో అంతర్గత కాలువలకు శంకుస్థాపన చేశారు. ఈ గ్రామంలోని లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేపట్టారు. బూర్జ, సుంకరాడ గ్రామాల్లో ఈ–పాస్ పుస్తకాలను రైతులకు స్పీకర్ తమ్మినేని అందజేశారు. బూర్జలో చేపడుతున్న భూముల రీ సర్వేను పరిశీలించి తహసీల్దార్ ఎస్.రమణారావుకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ చైర్మన్ బగాది నారాయణమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కొల్లివలసలో కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం